ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం: 36.0 కనిష్ఠం: 22.0
ANDHRAJYOTHY



పాలమూరును ఎడారి చేసే కుట్ర

- అందుకే బీఆర్‌ఎస్ కృష్ణా నదీజలాల్లో వాటా దక్కకుండా చేసింది
- ఏపీ ప్రాజెక్టులు కడుతుంటే వేడుక చూసి సహకరించింది
- 577 టీఎంసీలు రావాల్సి ఉండగా.. 299 టీఎంసీలకే కేంద్రం వద్ద ఒప్పుకుంది
- ప్రాజెక్టులు పూర్తికాకపోవడంతో ఒప్పుకున్నవీ వాడుకోని దుస్థితి
- రిజర్వాయర్ల పర్యటనలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి



కరివెన రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న వంశీచంద్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

మహబూబ్‌నగర్, మార్చి 1, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్ల రాష్ట్రాన్ని పాలించి.. పాలమూరును ఎడారి చేసేందుకు కుట్రలు పన్నిందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్‌ఎస్ నాయకుల మేడిగడ్డ పర్యటన సందర్భంగా మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలోని ఎమ్మెల్యేలంతా కలిసి శుక్రవారం చలో పాలమూరు-రంగారెడ్డి పర్యటన నిర్వహించారు. కరివెన, ఉదండాపూర్ రిజర్వాయర్లు, రంగారెడ్డి జిల్లా పరిధిలోని కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. పాలమూరు ప్రజలు 2009లో ఓట్లు వేసి గెలిపించినందుకు ఆ ప్రజలనే మోసం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందని అన్నారు. 2015లో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ప్రారంభించి.. కుర్చీ వేసుకుని కూర్చుని మరీ మూడేళ్లలో పనులు పూర్తి చేస్తానని చెప్పారన్నారు. 2024 వచ్చినా 50 శాతం కూడా పనులు పూర్తికాని దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర విభజనకు ముందు కృష్ణానదిలో ఉమ్మడి ఏపీకి 812 టీఎంసీల నీటి వాటా ఉండేదని, కానీ రాష్ట్ర విభజన తర్వాత కేసీఆర్ అసమర్థత వల్ల రాష్ట్రానికి 299 టీఎంసీలు మాత్రమే నీటివాటా దక్కిందన్నారు. అంతర్జాతీయ నదీ జలాల చట్టం ప్రకారం నది పరివాహకం ఏ ప్రాంతంలో ఎక్కువగా ఉంటే.. ఆ ప్రాంతానికే నీళ్లు దక్కాలని నిబంధన ఉందన్నారు. తెలంగాణలో కృష్ణానదికి 68 శాతం పరివాహకం ఉండగా.. న్యాయంగా 577 టీఎంసీల నీటివాటా దక్కాలన్నారు. కానీ అప్పటి సీఎం కేసీఆర్.. ఆంధ్రా పాలకుల మెప్పుకోసం, వారి మోచేతి నీళ్లు తాగి, కేవలం 299 టీఎంసీల వాటాకే ఒప్పుకున్నారని విమర్శించారు. ఈ రకంగా పాలమూరు జిల్లాను ఎడారిని చేసేందుకు ప్రయత్నించారని విమర్శించారు. స్వరాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రారంభించిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయకపోవడం వల్ల ఉన్న 299 టీఎంసీల నీటివాటాలో కేవలం 212 టీఎంసీల నీటినే తెలంగాణ వినియోగించుకుంటోందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును బొందలగడ్డ అని చెప్పిన కేసీఆర్.. ఇప్పుడు తమ నాయకులను మేడిగడ్డకు ఎందుకు పంపిస్తున్నారని ప్రశ్నించారు. ఒకప్పుడు కేసీఆర్ ప్రపంచంలో ఏడో వింతగా కాళేశ్వరాన్ని అభివర్ణించారని, ఇప్పుడు ఆయనకు మేడిగడ్డ బొందలగడ్డగా అనిపిస్తుందంటే ఆయన తప్పును ఒప్పుకున్నట్లేనని అన్నారు. ప్లానింగ్, కన్‌స్ట్రక్షన్, ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్‌లో లోపాల వల్లనే మేడిగడ్డ కుంగిందన్నారు. అదే మెథడాలజీతో నిర్మించిన దిగువ బ్యారేజీలకు కూడా ప్రమాదం పొంచి ఉందని ఆరోపించారు. అన్నారంలో కూడా ఇప్పటికే బుంగలు పడుతున్నాయని తెలిపారు. ఒక బేసిన్ నుంచి ఇంకో బేసిన్‌కు నీటిని తరలించవద్దని ఉన్నప్పటికీ.. సంగమేశ్వరం, రాయలసీమ లిఫ్టులు చేపట్టి ఏపీ 11 టీఎంసీల నీటిని పెన్నా బేసిన్‌కు తరలించేందుకు చూస్తుంటే కేసీఆర్ చోద్యం చూశారని విమర్శించారు. ఆ ప్రాజెక్టుల టెండర్ల సమయంలో తాను కేసీఆర్‌కు లేఖ రాశానన్నారు. ఆ సమయంలోనే జరిగిన అపెక్స్ కౌన్సిల్‌లో అడ్డుకోవాలని సూచించినా పట్టించుకోలేదన్నారు. రాయలసీమను రతనాల సీమగా చేస్తానన్న కేవలం రోజాకు ఇచ్చిన మాట కోసమే కేసీఆర్ ఇష్టారీతిన వ్యవహరించారని తెలిపారు. రూ.ఎనిమిది లక్షల కోట్ల అప్పు చేసి.. 'నేనే నిర్మాత, నేనే ఇంజనీర్, నాదే డిజైన్' అని చెప్పి కాళేశ్వరాన్ని నాశనం చేశారని అన్నారు. పాలమూరు - రంగారెడ్డిలో కూడా నాసిరకంగా పనులు చేపట్టినట్లు ఇక్కడి రైతులు చెబుతున్నారని అన్నారు. అలాగే సీపేజీలు కూడా వస్తున్నాయని, మాజీ ఎమ్మెల్యే పనులు చేసి.. డబ్బులు దండుకున్నారని విమర్శించారు. అసమర్థ ముఖ్యమంత్రికి చెంచాలుగా ఉన్న శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి పాలమూరు నీళ్ల తరలిపోతుంటే ఏమాత్రం జ్ఞానం లేకుండా ప్రేక్షక పాత్ర వహించారని మండిపడ్డారు. ఆనాడే రాజీనామా చేసి ఉంటే.. పాలమూరు ప్రజలు గుండెల్లో పెట్టుకుని చూసుకునేవారని తెలిపారు. పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 11 వేల క్యూసెక్కుల నుంచి 40 వేల క్యూసెక్కులకు పెంచినప్పుడు అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యే పీజేఆర్ పోరాటం చేశారని, కానీ 40 వేల నుంచి 98,500 క్యూసెక్కులకు పెంచినప్పుడు బీఆర్‌ఎస్ నాయకులు ఏం చేశారని ప్రశ్నించారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. మేడిగడ్డ ప్రమాదాన్ని చిన్నదిగా చూపడానికి బీఆర్‌ఎస్ నాయకులు ప్రయత్నం చేస్తున్నారని, ఆ నెపాన్ని కాంగ్రెస్‌పైకి నెట్టడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. మేడిగడ్డ కింద ఉన్న బ్యారేజీలు కూడా అదే విధంగా ఉన్నాయని, టోటల్ బ్యారేజీలే ప్రమాదంలో ఉన్నాయని తెలిపారు.

రైతులకు న్యాయం చేయలే: అనిరుధ్‌రెడ్డి

ఉదండాపూర్ రిజర్వాయర్ కింద భూములు కోల్పోయిన రైతులకు గత ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే న్యాయం చేయలేదని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి విమర్శించారు. ఆర్ అండ్ ఆర్ అమలు చేయలేదన్నారు. ఉదండాపూర్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అసెంబ్లీలో ఆర్అండ్ఆర్ సమస్యపై మాట్లాడలేదని, తాను మొన్న అసెంబ్లీలో మాట్లాడటంతో పాటు సీఎంను కలిశానని తెలిపారు. కాంట్రాక్టర్‌కు ఇచ్చే అంచనా వ్యయాలు పెరిగాయని, కానీ రైతుల ప్యాకేజీ మాత్రం పెంచడం లేదన్నారు. 40 వేల ఎకరాల భూమి పోతే నాలుగు గుంటలు కూడా రైతులకు భూమి ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్‌కు దమ్ముంటే పాలమూరుకు వచ్చి పోటీ చేయాలని సవాల్ విసిరారు. లక్ష్మారెడ్డి దమ్ముంటే సెక్యూరిటీ లేకుండా ఉదండాపూర్‌కు రావాలని అన్నారు.

ప్రాజెక్టుల పేరుతో దోచుకున్నారు: మధుసూదన్‌రెడ్డి

బీఆర్‌ఎస్ నాయకులు ప్రాజెక్టుల పేరుతో ప్రజల కష్టాన్ని దోచుకున్నారని, కానీ నీళ్లు తెచ్చే పనులు మాత్రం చేయలేదని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయకపోవడం వల్ల కృష్ణానదిలో నీటి వాటాను దక్కించుకోవడం లేదని తెలిపారు. పాలమూరు- రంగారెడ్డి 80 శాతం పూర్తయ్యిందని బీఆర్‌ఎస్ నాయకులు హైదరాబాద్‌లో కూర్చుని మాట్లాడుతున్నారని, కానీ 50 శాతం కూడా పూర్తి కాలేదని అన్నారు. ప్రాజెక్టు పేరుతో ఒంద్రుమట్టి దోచుకున్నారన్నారు. పాలమూరు జిల్లాలో అందుతున్న నీరు కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల వల్లేనన్నారు.

వేసవికి ముందే నీటి ఎద్దడి

- దాహార్తిలో నల్లమల చెంచుపెంటలు
- భూగర్భ జలాలు అడుగంటడంతో ఎండిన బోర్లు



ఈర్లపెంటలోని బావిలో అడుగంటిన నీరు

మన్ననూర్, మార్చి 1: వేసవికి ముందే ఎండలు మండుతుండటంతో నాగర్‌కర్నూల్ జిల్లాలోని చెంచు పెంటల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఈ ఏడాది వర్షాలు సరిగా కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి ఈ పరిస్థితి ఏర్పడింది. దాంతో బావుల్లో అడుగంటిన నీటిని తోడుకునేందుకు చెంచులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని అమ్రాబాద్, లింగాల మండలాల పరిధిలోని అప్పాపూర్, భౌరాపూర్, ఫుల్లాయపల్లి, రాంపూర్, కొమ్మనపెంట, ఈర్లపెంట, సంగిడి గుండాల, మేడిమొల్కల తదితర పెంటలకు మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేసే అవకాశం లేదు. వీరికి పురాతన బావులు, నీటి చెలిమలు, రక్షిత నీటి బోర్లే నీటి ఆధారం. చెంచు పెంటల్లో ఆర్‌డబ్ల్యూఎస్, ఐటీడీఏల సమన్వయంతో సౌరశక్తి బోరు మోటార్లు ఏర్పాటు చేసి, ఓవర్ హెడ్ ట్యాంక్‌ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు సరిగా కురవక సాధారణ వర్షపాతం సైతం నమోదు కాలేదు. దాంతో మళ్లీ వర్షాలు కురిసే వరకు ప్రత్యామ్నాయ మార్గాలు వెదికితే తప్ప చెంచుల దాహార్తి తీరే పరిస్థితి లేదు. వారం కిందట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో రోహిత్ గోపిడి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. చెంచు పెంటల్లో తాగునీటి సరఫరా ప్రస్తుత పరిస్థితి ఎలా ఉంది, నీటి వసతి ఎలా కల్పించాలో పెంటల వారీగా నివేదిక తయారు చేయాలని కోరారు.

సమస్యలు ఉన్న పెంటలివే..

మేడిమొల్కలో ఉండే తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకుకు పగుళ్లు ఏర్పడంతో అందులోకి నీరు నింపడం లేదు. దాంతో అక్కడ నీటి ఎద్దడి ఏర్పడింది. ఈర్లపెంటలోని బావిలో నీరు అడుగంటడంతో సౌరశక్తి మోటారు పని చేయడం లేదు. ఒకరు బావిలోకి దిగి, బిందెను నింపితే తాడు కట్టి పైకి లాగుతున్నారు. ఇలా బిందె నీటి కోసం గంటల తరబడి చెంచు మహిళలు ఎదురు చూస్తున్నారు. మేడిమొల్క పెంట వాళ్లు కూడా ఈర్ల పెంటలోని బావి వద్దకే వచ్చి నీటిని తీసుకెళ్తున్నారు. అప్పాపూర్ పెంటలోనూ భూగర్భ జలాలు అడుగంటడంతో బోరు మోటారులోంచి నీరు రావడం లేదు. వారు ఆశ్రమ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన కుళాయిల వద్ద చెంచులు నీటిని పట్టుకుంటున్నారు. ఫర్హాబాద్ పెంట వద్ద భూగర్భ జలాలు ఉన్నా.. అక్కడ బోరు మోటారు పని చేయడం లేదు.

పులి చెలిమ నుంచి తెచ్చుకుంటున్నాం

ఫర్హాబాద్ పెంటలో బోరు మోటారు పని చేయడం లేదు. దాంతో పులి చెలిమ నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం. అధికారులు స్పందించి తాగు నీటిని సరఫరా చేయాలి.

- తోకల లింగమ్మ, పరహాబాద్ పెంట

కలెక్టర్‌కు నివేదించాం

చెంచు పెంటల్లో భూగర్భ జలాలు అడుగంటిన మాట వాస్తవమే. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా కోసం కలెక్టర్ ఉదయ్ కుమార్‌కు నివేదించాం. మన్ననూరు నుంచి సమస్య తీవ్రంగా ఉండే మల్లాపూర్, మేడిమొల్కల, భౌరాపూర్, కొల్లం పెంటలకు రెగ్యులర్‌గా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తాం. మిగతా పెంటల్లోనూ సమస్య ఉంటే ట్యాంకర్లను పంపిస్తాం.

- హేమలత, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, నాగర్‌కర్నూల్

కథ అడ్డం తిరిగింది

- 54 మందికి డిప్యుటేషన్ ఆర్డర్ ఇవ్వాలని ఫైల్ సిద్ధం చేసిన అధికారులు
- ఇలాంటివి తన ముందుకు తేవొద్దని కలెక్టర్ ఆగ్రహం
- యథాస్థానానికే ఆర్డర్ ఇప్పిస్తామని రేటు మాట్లాడుకున్న ఓ ఉద్యోగి
- అక్రమాలకు కేంద్రంగా మారిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ
- డిప్యుటేషన్లు రద్దయినా పాత స్థానాలలోనే కొనసాగుతున్న ఉద్యోగులు



మహబూబ్‌నగర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) మార్చి 1: మహబూబ్‌నగర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఒకటి అనుకుంటే ఇంకొకటి జరిగింది. ఇటీవల ప్రభుత్వం అన్ని డిప్యుటేషన్లు రద్దు చేసిన విషయం తెలిసిందే. అయితే.. అత్యవసరం అనుకుంటే కలెక్టర్ అనుమతితో ఆర్డర్ తీసుకొని పని చేయించుకోవచ్చని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇదే అదునుగా భావించిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు డిప్యుటేషన్ రద్దు చేసిన 34 మందితో పాటు అదనంగా మరో 20 మంది అవసరమని మొత్తం 54 మందితో ఫైల్ సిద్ధం చేసి కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. కానీ ఊహించని రీతిలో కలెక్టర్ ఆ ఫైల్‌ను విసిరి కొట్టి, ఇంకోసారి ఇలాంటివి తన ముందుకు తేవొద్దని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్లాన్ బెడిసి కొట్టడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇంతకీ ఏంటా కథ అంటే..

అధికారులపై కలెక్టర్ ఆగ్రహం..

54 మందికి మళ్లీ డిప్యుటేషన్ ఆర్డర్లు ఇవ్వాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించేందుకు ప్రయత్నించారు. ఆ ఫైల్‌ను చూసిన కలెక్టర్ దాన్ని విసిరిపారేశారని తెలిసింది. రాష్ట్రం మొత్తంలో ఎక్కడా కూడా మళ్లీ డిప్యూటేషన్లు ఇచ్చిన దాఖలాలు లేవని, ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను తిరస్కరిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఒకరో.. ఇద్దరో అంటే సర్దుబాటు చేయవచ్చని.. డిప్యుటేషన్లు రద్దయిన అందరితో పాటు అదనంగా డిప్యుటేషన్లు ఇవ్వాలనడం ఏంటని ప్రశ్నించినట్లు సమాచారం. ఇలాంటివి ఇంకోసారి నా ముందుకు తేవొద్దని ఫైర్ అయినట్లు తెలిసింది.

34 మంది డిప్యుటేషన్లు రద్దు..

రాష్ట్ర ప్రభుత్వం అన్ని డిప్యుటేషన్లు రద్దు చేయడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో 34 మంది యథాస్థానాలకు వచ్చేశారు. వారిలో కొన్నేళ్లుగా ఇతర ప్రాంతాలలో పాతుకుపోయిన వారు, ప్రజాప్రతినిధుల సిఫారసుతో... లంచాలు ఇచ్చి మరీ తాము కోరుకున్న స్థానాలకు వెళ్లిన వారు ఉన్నారు. వారంతా యథాస్థానాలకు రావడంతో ఏం చేయాలో తోచక నానా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎలాగైనా డిప్యుటేషన్ స్థానాలకు వెళ్లాలని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులు బేఖాతరు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేస్తున్నారు. 34 మంది డిప్యుటేషన్లు రద్దయినప్పటికీ ఐదారుగురు మినహాయిస్తే అందరు యథాస్థానాల్లోనే పని చేస్తున్నారు. తమ స్థానాలలో జాయిన్ అయ్యి, మళ్లీ ఇక్కడే వచ్చి విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లు, హెల్త్ అసిస్టెంట్లు, హెల్త్ ఎడ్యుకేటర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు సైతం ఇందులో ఉన్నారు. హన్వాడ, రాజాపూర్, కోయిలకొండ, జానంపేట, భూత్పూర్, దేవరకద్ర, నవాబ్‌పేట, పీహెచ్‌సీలకు వెళ్లాల్సిన వారు జిల్లా కేంద్రంలోనే పని చేస్తున్నారు. బాదేపల్లిలో పనిచేసే ఓ ఉద్యోగి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నామంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని సమాచారం. రాజాపూర్‌లో పనిచేయాల్సిన ఓ ల్యాబ్ టెక్నీషియన్ ఇక్కడే పని చేస్తూ, అక్కడ ఓ ప్రైవేటు టెక్నీషియన్‌తో టెస్టులు చేయిస్తున్నారు. ఆ శాఖకు చెందిన ఉన్నతాధికారి సైతం చూసీ చూడనట్లు ఉంటున్నారు. ఈ విషయమై డీఎంఅండ్‌హెచ్‌వోను సంప్రదించడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ఆర్డర్ ఇప్పిస్తామని రేటు..

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని ఓ ఉద్యోగి డిప్యుటేషన్లు రద్దయిన వారికి తిరిగి వారి స్థానాల్లో ఆర్డర్ ఇప్పిస్తామ బేరం మొదలు పెట్టారు. కార్యాలయ అధికారులపై ఒత్తిడి తెచ్చి, డీఎంఅండ్‌హెచ్‌వోతో సంతకం చేయించి ఫైల్‌ను సిద్ధం చేశారు. డిప్యుటేషన్ రద్దయిన 34 మందితో పాటు అదనంగా మరో 20 మంది అవసరమని మొత్తం 54 మందికి డిప్యుటేషన్ ఆర్డరు ఇవ్వాలని ఫైల్ తయారు చేసి, కలెక్టర్‌కు పంపించారు. ఈ క్రమంలో ఒక్కో ఆర్డర్‌కు రూ. 10 వేల నుంచి రూ.15 వేల వరకు మామూళ్లు ఇవ్వాలని ఆయా ఉద్యోగులతో ఒప్పందం కుదుర్చుకున్నారని సమాచారం. ఆర్డర్ వచ్చిన తర్వాతే డబ్బులు ఇవ్వాలని కూడా నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఫైల్ సిద్ధం చేసిన కలెక్టర్‌కు పంపించారు.

గణప సముద్రం రీడిజైన్

- అనుమతి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- కట్ట వెడల్పు ఆరు మీటర్లకు తగ్గింపు..
- త్వరలో పనులు ప్రారంభిస్తామంటున్న అధికారులు



గణప సముద్రం రిజర్వాయర్ నిర్మించాల్సిన ప్రాంతం

ఖిల్లాఘణపురం, మార్చి 1: వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలో నిలిచిపోయిన గణప సముద్రం రిజర్వాయర్ పనులను రీ డిజైన్ చేసి, ప్రారంభించడానికి ఇరిగేషన్ అధికారులు కసరత్తు ప్రారంభించారు. పాత డిజైన్‌ను మార్పు చేసి, కొత్త డిజైన్‌ను ప్రభుత్వ అనుమతి కోసం పంపించారు. అనుమతి రాగానే పనులు చేపడతామని అంటున్నారు. మండల కేంద్రంలోని గణప సముద్రం చెరువును రిజర్వాయర్‌గా మార్పు చేయడానికి గత ప్రభుత్వ హయాంలో రూ.47.36 కోట్ల నిధులను కేటాయించింది. ముంపు రైతుల ఆందోళనల మధ్య అప్పట్లో 10 మీటర్ల వెడల్పుతో చెరువు కట్టను నిర్మించి, పైనుంచి రోడ్డు, అలుగు దగ్గర బ్రిడ్జి నిర్మించేలా ప్రతిపాదనలను సిద్ధం చేశారు. పనులకు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి భూమి పూజ చేశారు. హర్ష కన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్టు దక్కించుకుంది. చెరువు కట్ట పనులు ప్రారంభించగా, ముంపు రైతులు అడుగడుగునా అడ్డుకున్నారు. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. ఈ రిజర్వాయర్‌లో 588 ఎకరాల భూమి ముంపునకు గురవుతుండగా, 388 ఎకరాలను స్వాధీనం చేసుకుని మొదటి గెజిట్‌ను విడుదల చేశారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సమీకరణలు మారిపోయాయి. చెరువు కట్ట వెడల్పును ఆరు మీటర్లకు తగ్గించి, బ్రిడ్జి నిర్మాణం, చెరువు కట్టపై రోడ్డు లేకుండా డిజైన్ మారుస్తూ ప్రభుత్వానికి ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. త్వరలో మరో 200 ఎకరాలకు సంబంధించి గెజిట్ విడుదలయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అయితే మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఎకరాకు రూ.10 లక్షలు ఇప్పిస్తామని చెప్పగా, ప్రస్తుత ఎమ్మెల్యే మేఘారెడ్డి రూ.20 లక్షలు ఇప్పిస్తామని చెప్పారు. ఎకరాకు రూ.20 లక్షలు ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.



పనులు చేపట్టడానికి తెచ్చిన మెటీరియల్

జలాశయం పనులను ప్రారంభిస్తాం

గణప సముద్రం రిజర్వాయర్ పనులను వారం రోజుల్లో ప్రారంభిస్తాం. చెరువు కట్ట వెడల్పు తగ్గించి, సర్వీస్ రోడ్డు నిర్మాణంతో కొత్త డిజైన్‌ను అనుమతి కోసం ప్రభుత్వానికి పంపించాం. అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ముంపు రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుంది. పనులు ఇంకా ఫౌండేషన్ స్థాయిలోనే ఉన్నాయి.

- నరేందర్ రెడ్డి, ఇరిగేషన్ డీఈ, వనపర్తి జిల్లా

సీఎం సభా స్థలం పరిశీలన

మహబూబ్‌నగర్, మార్చి 1: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల ఆరో తేదీన పాలమూరు పర్యటన దాదాపు ఖరారైంది. దాంతో సభ నిర్వహించాలని నిర్ణయించిన కాంగ్రెస్ నాయకులు ఎంవీఎస్ కళాశాల మైదానాన్ని శుక్రవారం పరిశీలించారు. పోలీసు అధికారులతో కలిసి స్థలాన్ని చూశారు. బందోబస్తు పరంగా తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ అధికారులు పరిశీలించారు. ఎమ్మెల్సీతోపాటు ఎంపీ ఎన్నికలు ఉన్నందున కాంగ్రెస్ నాయకులు ఈ సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని భారీగా జన సమీకరణ చేయాలని భావిస్తున్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏ.రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, నాయకులు ఎం.సురేందర్‌రెడ్డి, సిరాజ్‌ఖాద్రి, నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.



ఎంవీఎస్ కళాశాల మైదానాన్ని పరిశీలిస్తున్న నాయకులు, పోలీసులు

దీవించమ్మా ఎల్లమ్మ

- పోలేపల్లిలో ఘనంగా సిడె
- గవ్వల బండారు చల్లుతూ జేజేలు పలికిన భక్తులు



సిడెపై ఊరేగుతున్న అమ్మవారు

కోస్గి రూరల్, మార్చి 1: వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం పోలేపల్లి ఎల్లమ్మ సిడె శుక్రవారం ఘనంగా జరిగింది. సిడెపై అమ్మవారి విగ్రహం ఉంచి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. వేలాదిగా హాజరైన భక్తులు అమ్మవారికి జేజేలు పలికారు. గవ్వల బండారు చల్లుతూ దీవించమ్మా అంటూ వేడుకున్నారు. గవ్వలు కలిపిన పసుపును అమ్మవారిపై చల్లితే కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. సిడె ఘట్టం ముగిశాక అమ్మవారి రథంపై పడిన గవ్వలను తీసుకునేందుకు భక్తులు ఎగబడతారు. ఈ గవ్వలను తీసుకెళ్లి ఇంట్లో ఉంచుకుంటే అమ్మవారి అనుగ్రహం ఉంటుందని భావిస్తారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. కోళ్లు, మేకలను కోసి, మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో తినుబండారాలు, గాజులు, బొమ్మల దుకాణాలు వెలిశాయి. రంగుల రాట్నం భక్తులను ఆకట్టుకుంటోంది. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



వేలాదిగా హాజరైన భక్తులు



భక్తి శ్రద్ధలతో రాజవలి గంధోత్సవం

అమరచింత గంధోత్సవంలో భక్తులు

అమరచింత, మార్చి 1: కులమతాలకతీతంగా జరుపుకొనే అమరచింత రాజవలి దర్గా ఉత్సవాల్లో మొదటిరోజు గంధోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వ హించారు. శుక్రవారం రాత్రి తొమ్మిది గంటలకు వనపర్తి జిల్లా, అమరచింత మండలంలోని శ్రీకృష్ణ నగర్ నుంచి ప్రత్యేక పూజల మధ్య ఈ గంధోత్సవం ప్రారంభమైంది. రాజావలి వెండి దర్గా ప్రతిమను కాంగ్రెస్ నాయకుడు నాగరాజుగౌడ్ తలపై పెట్టుకొని ఫరీద్ ఆఫీజ్‌తో కలిసి ఊరేగింపులో పాల్గొన్నారు. గంధో త్సవం డప్పు వాయిద్యాలు, కోలాటం ప్రత్యేక విన్యాసాల మధ్య తహసీల్దార్ కార్యాలయం మీదుగా రాజావలి దర్గాకు చేరుకుంది. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు అమరచింత, ఆత్మకూరు మండలాల ప్రజలే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చారు.

బీసీల వాటా కోసమే మహాపాదయాత్ర

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేంద్రగౌడ్
- నవాబ్‌పేటలో మొదలైన మహాపాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న నరేంద్ర గౌడ్, ప్రజాసంఘాల నాయకులు

నవాబ్‌పేట, మార్చి 1 : చట్టసభల్లో వాటా కోసమే బీసీల మహాపాదయాత్ర ప్రారంభించినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేంద్రగౌడ్ చెప్పారు. శుక్రవా రం మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం మెరుగోని పల్లిలో పండుగ సాయన్న విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించి పాద యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడీలు బద్దలు కొట్టిన పండుగ సాయన్న సొంత గ్రామం నుంచి పాదయాత్ర ప్రారంభించడం బీసీల కు శుభసూచకమన్నారు. ప్రభుత్వాలు మారినా పాలకులు మారినా బీసీలు చట్ట సభలకు రాలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యాత్రతో రాష్ట్రంలో పెనుమార్పులు రానున్నాయన్నారు. ఈ యాత్ర ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఖిల్లాషాపూర్ వరకు సుమారు 360 కిలోమీటర్ల మేర కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో హిందూ బీసీ మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్ పటేల్, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయి నరేందర్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ బొళ్ల లింగ మూర్తి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అనుకున్నది సాధించారు..

» ఒకేసారి మూడు, నాలుగు ఉద్యోగాలతో ముందుకు..

పట్టుదల ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా సాధించొచ్చని నిరూపించారు వారు. ఒక్కొక్కరు మూడు నుంచి నాలుగు ఉద్యోగాలు సాధించి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. కుటుంబ పోషణ కోసం పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూనే, ఖాళీ సమయంలో చదువుకుంటూ విజయం సాధించారు. ఎందరికో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే కల ఉంటుంది. కానీ వీరు మాత్రం మూడు నుంచి నాలుగు ఉద్యోగాలు సాధించి శభాష్! అనిపించుకున్నారు. 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం వారిని పలుకరించగా తమ విజయ గాథను పంచుకున్నారు.

పోరాట పటిమతోనే మూడు ఉద్యోగాలు సాధించా..



- ఇనుగంటి వెంకటేశ్వర్లు, పెద్దకార్పాముల

నా తల్లిదండ్రుల కల, పేదరిక నేపథ్యమే ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న ఆలో చనలను నాలో పెంచాయని.. ఆ పోరాట పటిమతోనే ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించానని ఇనుగంటి వెంకటేశ్వర్లు అన్నారు. పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాముల గ్రామానికి చెందిన అలివేలమ్మ, చంద్రమౌళి కుమారుడు వెంకటేశ్వర్లు గతంలో టెట్‌లో 117 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించాడు. అలాగే జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎల్) కూడా సాధించాడు. పేద కుటుంబంలో జన్మించిన వెంకటేశ్వర్లు పెద్ద కొత్తపల్లిలోని ఉన్నత పాఠశాలలో పదవ తరగతి, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, వనపర్తిలో డిగ్రీ, హైదరాబాద్‌లో బీఈడీ, పీజీ పూర్తి చేశాడు. తల్లిదండ్రులు చిన్న హోటల్ నడుపుకుంటూ ఎన్నో వ్యయప్రయాసాలకోర్చుకొని ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు(వెంకటేశ్వర్లు)ను చదివించారు. కొన్నేళ్ల క్రితం వెంకటేశ్వర్లుకు వివాహం కావడంతో నాలుగేళ్లపాటు హైదరాబాద్‌లో నివసిస్తూ, భార్య, పిల్లలతో అక్కడే ఉండి చదువుకున్నాడు. ఇటీవల జరిగిన గురుకుల ఉద్యోగ పోటీ పరీక్షల్లో జూనియర్ లెక్చరర్, టీజీటీ, పీజీటీ మూడు ఉద్యోగాలు సాధించాడు.

- పెద్దకొత్తపల్లి

కష్టపడితే ఫలితం వస్తుంది : నరసింహాస్వామి



కష్టపడి చదివితే ఫలితం వస్తుందని నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం ఖైలారం గ్రామానికి చెందిన పి.నరసింహాస్వామి రుజువు చేశారు. రజక కులానికి చెందిన నరసింహాస్వామి హైదరాబాద్‌లో ఉంటూ పార్ట్‌టైమ్‌గా లిఫ్ట్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తల్లి దండ్రులు గ్రామంలోనే ఉంటుండగా, ఇతను భార్యతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ఉద్యోగ నియామకాల్లో ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించాడు. పీజీటీతో పాటు, తాజాగా వెలువడిన జూనియర్ లెక్చరర్ ఉద్యోగం, టీజీటీలో సోషల్, ఇంగ్లీష్ ఉద్యోగాలు సంపాదించాడు. ఒకేసారి నాలుగు ఉద్యోగాలు రావడం సంతోషాన్ని కల్పించిందని నరసింహాస్వామి పేర్కొన్నాడు.

- కోడేరు

గ్రూప్-1 ఉద్యోగమే లక్ష్యంగా చదువుతా : కౌసల్య



గ్రూప్ -1 ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా కష్టపడి చదువుతానని, బుధవారం వెలువడిన గురుకుల ఫలితాలలో జేఎల్, డీఎల్ పోస్టులకు ఎంపికైన అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ శ్రీహరి, వసంత దంపతుల కూతురు కౌసల్య పేర్కొన్నారు. శుక్రవారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో తన సంతోషాన్ని పంచుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ పూర్తి చేసి ఘట్‌కేసర్ గురుకుల పాఠశాలలో పనిచేస్తూ వీలు కుదిరనప్పుడు చదివే దాన్నని, కాగా పరీక్షలకు ఒక నెల ముందుగా సెలవు పెట్టి పూర్తి స్థాయిలో ఇంట్లోనే ప్రిపేర్ అయ్యానని, తన భర్త మల్లేశ్ పూర్తి సహకారం అందించారని, తాను డీఎల్ ఉద్యోగాన్ని ఎంచుకుంటానని అన్నారు. ఇదే స్ఫూర్తితో గ్రూప్-1 ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా మరింత కష్టపడతానని తెలిపారు.

- అడ్డాకుల

ప్రొఫెసర్ కావాలన్నదే లక్ష్యం : దాసరి అక్షయ్



ప్రొఫెసర్ కావాలన్నదే తన లక్ష్యమని నల్లమల యువకుడు దాసరి అక్షయ్ అన్నారు. ఇటీవల వెలువడిన గురుకులాల పరీక్షల ఫలితాల్లో అక్షయ్ ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించాడు. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామానికి చెందిన దాసరి మీనమ్మ, జైపాల్‌కు నలుగురు సంతానం కాగా, రెండోవాడు అక్షయ్. పేదరికంలో పుట్టిన అక్షయ్ ఎలాంటి కోచింగ్‌లు తీసుకోకుండా సొంతంగా పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యాడు. పోటీ పరీక్షల్లో పాల్గొని ఇంగ్లీష్, టీజీటీ, పీజీటీ జూనియర్ లెక్చ రర్, డిగ్రీ లెక్చరర్‌గా ఉద్యోగాలు సాధించాడు. ఇష్టంతో చదివితే ఏదైనా సాధించవచ్చని అక్షయ్ పేర్కొన్నాడు. తన ప్రయాణం ఇంతటితో ఆగదని, ప్రొఫెసర్ అయ్యేందుకు లక్ష్యంతో ముందుకు సాగుతానని తెలిపాడు.

- అచ్చంపేట

లెక్చరర్ కావడమే ధ్యేయం : దీపారెడ్డి



చిన్ననాటి నుంచి చదువు అంటే ఇష్టం. నాన్న దేవసేనారెడ్డి ప్రతీరోజు ఉదయం దినపత్రిక చదవడం చూసి త్వరగా చదువుకోవాలని, రోజూ దినపత్రికలు చదవడాన్ని అలవర్చుకున్నా. ఇప్పటికీ ప్రధాన ప్రతికలు మూడు ఇంటికి తెప్పించుకుని చదువుతుంటాను. నేను చదవడమే కాదు.. ఇంకొకరికి చదువు చెప్పడమే ధ్యేయంగా మలుచుకున్నా. పాఠశాలకు వెళ్లినప్పటి నుంచి ఉద్యోగం సాధించాలని, కాలేజీలో లెక్చరర్ కావాలనే కోరికతో చదివినట్లు దీపారెడ్డి తెలిపారు. మొదటిసారిగా ఉద్యోగం కోసం నాలుగు పరీక్షలు గురుకుల జూనియర్ లెక్చరర్, గురుకుల పీజీటీ, ఏకలవ్య మోడల్ స్కూల్ టీచర్, గురుకుల డిగ్రీ కళాశాల అధ్యాపక ఉద్యోగాలకు పరీక్షలు రాశాను. అన్నింటిలో ఉద్యోగాలు రావడం సంతోషంగా ఉంది. చదువుకునే రోజుల్లో నేను ఎంచుకున్న చదువుకు మా నాన్న ఏవిధమైన ఆటంకం చెప్పలేదు. అందుకే ఇష్టంతో చదివా, విజయం సాధించా.

- మానవపాడు

మూడు ఉద్యోగాలు రావడం సంతోషాన్నిచ్చింది..



- లంకాల సంతోష

మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండలంలోని దాసర్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లంకాల సంతోష ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించింది. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ఆమెను పలకరించగా ఆమె పేరు సంతోషగా ఎలా ఉందో అదే సంతోషాన్ని వ్యక్తం చేశారు. మూడు ఉద్యోగాలు రావటం తనకు ఎంతగానో ఆనందాన్నిచ్చిందని, టీచర్‌గా ఉద్యోగం సాధించాలని ఉన్నా, గతంలో గ్రామంలో అనుకోకుండా రాజకీయంగా గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యాను. భర్త లంకాల రాఘవేందర్ రెడ్డితో పాటు అత్త, మామయ్య, తోడికోడళ్లు అందరి ప్రోత్సాహంతో ఉద్యోగం సాధించాలన్న తపనతో కోచింగ్‌కు సిద్ధమయ్యాను. హైదరాబాద్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో టీజీపీ కోసం మూడునెలల పాటు శిక్షణ తీసుకున్నా. మిగతా వివిధ రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్ చదివాను. లక్ష్యం సాధించాలన్న పట్టుదలతో నేనే మూడు ఉద్యోగాలను సాధించాను.

- చిన్నచింతకుంట

మనస్తాపానికి గురై బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 1 : మనస్తాపానికి గురై బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడకు చెందిన కార్తీక్(21) హైదరాబాద్‌లో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గతనెల 24న కళాశాల నుంచి ఇంటికొచ్చిన కార్తీక్ వారం రోజుల నుంచి మౌనంగా ఉంటున్నాడు. కుటుంబ సభ్యులు అడిగిన కూడా ఏం చెప్పకుండా ఉన్నాడు. గురువారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుని అన్న శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నవాబ్‌పేట, మార్చి 1 : భర్తతో గొడవ పడి ఓ మహిళ ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై అభిషేక్‌రెడ్డి శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లోకిరేవుకు చెందిన శ్యామలమ్మ(45) తన భర్త నర్సింహులుతో సంసార విషయంలో గతనెల ఐదో తేదీన గొడవ పడి ఇంట్లో ఉన్న కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు మంటలు ఆర్పి చికిత్స నిమిత్తం 108లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఫిబ్రవరి 29న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్‌కు కౌన్సిలర్ రాజీనామా

వనపర్తి టౌన్, మార్చి 1 : వనపర్తి మునిసిపాలిటీ 16వ వార్డుకు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్‌గా గెలుపొందిన డి.పద్మ పార్టీకి రాజీనామా చేశారు. శుక్రవారం తన రాజీనామా పత్రాన్ని పార్టీ కార్యాలయానికి పంపించినట్లు ఆమె తెలిపారు. వ్యక్తిగత కారణాలతో పార్టీకి, పార్టీ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని, తన భర్త శేఖర్ కూడా పార్టీకి, క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నట్లు ఆమె తెలిపారు.

6న రామలింగేశ్వరాలయంలో ప్రసాదాలు, తలనీలాలకు బహిరంగ వేలం

అడ్డాకుల, మార్చి 1 : మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం కందూరు గ్రామంలో దక్షిణ కాశీగా పిలువబడుతున్న రామలింగేశ్వరాలయం బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల ఆరో తేదీన ప్రసాదాలు, కొబ్బరికాయలు, తలనీలాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈవో రాజేశ్వరశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయలు విక్రయించుకునేందుకు రూ.50వేలు, లడ్డు, పులిహోర, ప్రసాదాలు విక్రయించుకునేందుకు రూ.50వేలు, కొబ్బరిచిప్పలు పోగు చేసుకునేందుకు రూ.10వేలు నగదుగా డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని ఈవో రాజేశ్వరశర్మ పేర్కొన్నారు. దేవాలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలు, దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం ఉంటుందని, ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మన్ననూర్, మార్చి 1 : బోయినపల్లిలోని ఆశ్రమ పాఠశాలలో గల వాటర్ స్పోర్ట్స్ అకాడమీ యందు క్రీడా శిక్షణ శిబిరంలో ప్రవేశాలు పొందేందుకు 5వ తరగతిలో ప్రవేశానికి 4వ తరగతి చదివే గిరిజన విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి (డీటీడీవో) కమలాకర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. కయాకింగ్ కనోయింగ్, సెయిలింగ్, ఫెన్సింగ్ మొదలగు వాటర్ స్పోర్ట్స్‌లో బాల బాలికలకు శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. విద్యార్థుల ఎత్తు, బరువు, స్టాండింగ్ జంప్, బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్‌త్రో, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్ ఫ్లెక్సీబిలిటీ టెస్ట్, కెటిల్‌రన్, 800 మీటర్ల పరుగుపందెంలో ఎంపిక పరీక్షలు ఈనెల 5వతేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అచ్చంపేట గిరిజన సంక్షేమ శాఖ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. తుది ఎంపికలు ఈనెల 21న హకీంపేట క్రీడా పాఠశాలలో నిర్వహించి 10 మంది బాలురు, 10 మంది బాలికలకు స్పోర్ట్స్ పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాలు కల్పిస్తామని వివరించారు. ఆసక్తి కలిగిన గిరిజన విద్యార్థినీ విద్యార్థులు రెండు పాస్‌ఫొటోలు, ఆధార్, బోనఫైడ్‌లు తీసుకొని ఈనెల 5న అచ్చంపేట ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించే ఎంపికలకు హాజరవ్వాలని డీటీడీవో కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవాబ్‌పేట, మార్చి 1 : అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై అభిషేక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని రాంసింగ్ తండాలో పోలీస్ సిబ్బంది మహేష్, శెట్టినాయక్ విధులు నిర్వహిస్తుండగా సురేష్ అనే యువకుడు రాత్రి మూడు గంటల ప్రాంతంలో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వివరాలు సేకరించగా, ఎలాంటి అనుమతులు లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సదగోడు గ్రామ సమీపంలో..

ఉప్పునుంతల : నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం సదగోడు గ్రామ సమీపంలోని దుందుభి వాగు నుంచి ఇసుక తరలిస్తున్న పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై లెనిన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గట్టుకాడిపల్లి గ్రామానికి చెందిన బోల్లు ఆంజనేయులు శుక్రవారం ట్రాక్టర్ ద్వారా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని పరిశీలించామన్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మురహర్‌దొడ్డి గ్రామంలో..

కృష్ణ : ఎలాంటి అనుమతి లేకుండా కృష్ణానది నుంచి అర్ధరాత్రి సమయంలో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం నారాయణపేట జిల్లా కృష్ణ మండలం మురహర్‌దొడ్డి గ్రామంలో తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్సై నావిద్ తెలిపారు. ట్రాక్టర్‌ను యజమాని కుమ్మరి రాజుపై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

అమరచింత క్రీడాకారిణిని అభినందించిన సీఎం

» హర్షం వ్యక్తం చేసిన ప్రముఖులు



క్రీడాకారిణి మేఘనారెడ్డిని అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

అమరచింత, మార్చి 1 : బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ ఛాలెంజ్-2024 క్రీడల్లో కాంస్య పతకం సాధించిన క్రీడాకారిణి మేఘనారెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. వనపర్తి జిల్లా అమరచింతకు చెందిన రవీందర్‌రెడ్డి పోలీస్ శాఖలో డీఎస్పీగా పని చేస్తున్నారు. హైదరాబాద్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న రవీందర్‌రెడ్డికి ఇద్దరు కూతుళ్లలో పెద్ద కూతురు మేఘనారెడ్డి డిగ్రీ రెండో సంవత్సరం చదువుతూ క్రీడల పట్ల మక్కువ పెంచుకున్నారు. రెండో కూతురు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మేఘనారెడ్డి 2024 ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ ఛాలెంజ్ పోటీలు ఉగాండాలో జరిగాయి. పోటీల్లో మేఘనారెడ్డి ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించింది. దీంతో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో క్రీడాకారిణి మేఘనారెడ్డిని, ఆమె తండ్రి రవీందర్‌రెడ్డిలను సీఎం రేవంత్‌రెడ్డి గురువారం సచివాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. గతంలో మేఘనారెడ్డి అంతర్జాతీయ సిరీస్-2023లో బంగారు పతకం, కంపాలలో జరిగిన ఇంటర్నేషనల్-2003 పోటీల్లో వెండి పతకం, గోవాలో జరిగిన జాతీయ క్రీడల్లో కాంస్య పతకంతో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారు. కాంస్య పతకం సాధించిన మేఘనారెడ్డి సొంత ఊరైన అమరచింతలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, శ్రేయోభిలాషులు, డీఎస్పీ రవీందర్‌రెడ్డి స్నేహితులు ప్రత్యేకంగా అభినందించారు.

విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి

ఖిల్లాఘణపురం, మార్చి 1 : విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం కొత్తపల్లి తండా శివారు ప్రాంతంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రుక్కన్నపల్లి గ్రామానికి చెందిన సేవ్యానాయక్‌కు మానాజీపేట - కొత్తపల్లి తండా శివారు ప్రాంతంలో వ్యవసాయ పొలం ఉంది. పొలంలో బోరు మోటార్‌ను మరమ్మతు చేసేందుకు గాను పెద్దమందడి మండలం వీరాయిపల్లి గ్రామానికి చెందిన మెకానిక్ రహీం(45)ను తీసుకెళ్లాడు. రహీంతో పాటు, మల్లేష్ అనే వ్యక్తి శుక్రవారం పొలంలో బోరు మోటార్ తీసే సమయంలో పైన ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లు ఇనుప పైపులకు తగిలాయి. దీంతో పైపులను పట్టుకున్న రహీం విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందగా, మల్లేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన మల్లేష్‌ను వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలు అందించారు. రహీంకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు, బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

మాగనూరు, మార్చి 1 : నారాయణపేట జిల్లా మాగనూరు పోలీస్‌స్టేషన్ సమీపంలో గల 167వ అంతర్జాతీయ రహదారిపై శుక్రవారం కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై ఎండీ.అబ్దుల్‌ఖాదర్ తెలిపిన వివరాల ప్రకారం.. జోగులాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం ఇరికిచేడు గ్రామానికి చెందిన మేఘారెడ్డి, వీరారెడ్డిలు కర్ణాటకలోని రాయచూర్ నుంచి మక్తల్‌కు బైక్‌పై వెళ్తున్నారు. మాగనూరు వద్ద ఎదురుగా వచ్చిన కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వేమారెడ్డి, వీరారెడ్డికి బలమైన గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. వేమారెడ్డి భార్య పల్లవి ఫిర్యాదు మేరకు కారు నడుపుతున్న మాగనూరు గ్రామానికి చెందిన నగరం మధుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం.. ముగ్గురికి తీవ్ర గాయాలు

కొత్తకోట, మార్చి 1 : కారు టైరు పంక్చర్ అయి డివైడర్ ఢీకొంటూ అవతలి రోడ్డులో పల్టీలు కొట్టి ఆ సమయంలో అటుగా వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన రాజు, రవివర్మ, రాజవర్ధన్ కర్నూల్‌లో మిత్రుని వివాహనికి వెళ్లారు. పెళ్లి వేడుకలు ముగించుకొని తిరిగి హైదరాబాద్ వెళ్తుండగా జాతీయ రహదారి కొత్తకోట బైపాస్‌లో కారు టైర్ పంక్చర్ అయింది. పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొంటూ రైట్ సైట్ రోడ్డులోకి జంప్ చేసి పల్టీలు కొట్టింది. ఆ సమయంలో కర్నూల్ వైపు వాహనాలు రాకపోవడంతో కారులోని మిత్రులకు తీవ్ర గాయాలు అయ్యాయి. వాహనదారులు గమనించి 108కు ఫోన్ చేసి చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పశువుల మందపై పులి దాడి, ఆవు మృతి

దోమలపెంట, మార్చి 1 : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ అభయారణ్యం దోమలపెంట రేంజ్ పరిధిలోని వటువర్లపల్లిలో శుక్రవారం తెల్లవారుజామున పశువుల మందపై పులి దాడి చేయడంతో పాడి ఆవు మృతి చెందింది. మన్ననూర్ గ్రామానికి చెందిన రైతు బాన్యానాయక్ గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో పశువుల మందను ఉంచారు. శుక్రవారం తెల్లవారుజామున పులి పశువుల దొడ్డిలోకి చొరబడి పాడి ఆవు గొంతుపై దాడి చేసి చంపివేసింది. విషయాన్ని బాన్యానాయక్ స్థానిక అటవీశాఖ అధికారులకు తెలియజేశాడు. దోమలపెంట ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్ అటవీశాఖ సిబ్బందితో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించి, పంచనామా నిర్వహించారు. నివేదికను అటవీశాఖ ఉన్నతాధికారులకు అందజేస్తామని ఎఫ్ఆర్‌వో తెలిపారు. గత సంవత్సరం జూన్‌లో ఇదే దొడ్డిలో పులి దాడి చేసి ఆవును చంపివేసింది. రెండురోజుల క్రితం సార్లపల్లి గ్రామ సమీపంలో కూడా పులి దాడిలో పాడి ఆవు మృతి చెందిందని అటవీశాఖ అధికారులు తెలిపారు. మృతిచెందిన పశువు విలువ రూ.30 వేలకు పైగా ఉంటుందని రైతు వాపోయాడు.

రేపు అభ్యుదయ రచయితల సంఘం మహాసభలు



ఉమ్మడి జిల్లా మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 1 : ఈ నెల 3న అభ్యుదయ రచయితల సంఘం ఉమ్మడి జిల్లా మహాసభలు, కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పెబ్బేటి మల్లికార్జున్, సంఘం జిల్లా అధ్యక్షుడు కల్వకోల్ మద్దిలేటిలు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని మల్లికార్జున్ గ్రంథాలయంలో ఉమ్మడి జిల్లా మహాసభల గోడపత్రికలను కవులు, రచయితలు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ మహాసభల ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్సీ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గోరటి వెంకన్న, గౌరవ అతిథులుగా అరసం జాతీయ నాయకులు వేల్పుల నారాయణ, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పల్లెర్ల వీరస్వామి, రాపోలు సుదర్శన్, సలహాదారులు కామ్రేడ్ ఆనంద్‌జీ, పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు రాఘవాచారిలు పాల్గొంటారని వారు తెలిపారు. రెండవ సెషన్‌లో తెలుగు సాహిత్యంలో అరసం పాత్ర, నేటి సమాజానికి కావాల్సిన సాహిత్యం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అనే అంశాలపై సదస్సు ఉంటుందని, మూడవ సెషన్‌లో కవి సమ్మేళనం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లాలోని కవులు, రచయితలు, సాహిత్య అభిమానులు, కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కవులు, రచయితలు వనపట్ల సుబ్బయ్య, వహీద్‌ఖాన్, ఎదిరేపల్లి కాశన్న, ఇద్రీస్, ఎల్.విజయ, అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రాంతి, మంజుల, సీనియర్ జర్నలిస్టులు కందికొండ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 5 నుంచి చెక్‌పోస్టు నిబంధనల సడలింపు

» మహాశివరాత్రి సందర్భంగా 24 గంటల పాటు అన్ని వాహనాలకు అనుమతి



మన్ననూరులోని అటవీశాఖ చెక్‌పోస్టు

మన్ననూర్, మార్చి 1 : మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈనెల 5 నుంచి 11 వరకు అమ్రాబాద్ పులుల అభయారణ్యంలోని మన్ననూరు, దోమలపెంట చెక్‌పోస్టుల నిబంధనలను సడలిస్తున్నట్లు అటవీశాఖ వైల్డ్‌లైఫ్ నుంచి అనుమతి వచ్చిందని నాగర్‌కర్నూల్ అటవీశాఖ డీఎఫ్‌వో రోహిత్ గోపిడి తెలిపారు. వైల్డ్‌లైఫ్ నిబంధనల మేరకు పెద్దపులులు తదితర వన్యప్రాణులకు నిద్రాభంగం కల్గించకుండా ప్రతీరోజు రాత్రి తొమ్మిది నుంచి ఉదయం ఆరు గంటల వరకు ఎలాంటి వాహనాల అనుమతులు ఉండవు. శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఉండడం వలన శ్రీశైలానికి శివస్వాములతో పాటుగా ఇతర పర్యాటకుల వాహనాలు నిత్యం వేలాదిగా వెళతూ ఉంటాయి. భక్తులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ ఎంసీ పర్గెన్ నుంచి 24 గంటలు వాహనాలు అనుమతించాలని ఏటీఆర్‌కు శుక్రవారం లేఖ అందింది. ఇదే సందర్భంలో ఏటీఆర్ క్షేత్ర సంచాలకులు(ఎఫ్‌డీ) క్షితిజ కొన్ని నిబంధనలను విధించారు. రాత్రి తొమ్మిది నుంచి ఉదయం ఆరు గంటల వరకు విడతల వారీగా వాహనాలను చెక్‌పోస్టుల నుంచి పంపించాలని, 20 వాహనాలను ఒక్కోసారి పంపించడం వలన అడవిలో ట్రాఫిక్ సమస్య లేకుండా ఉంటుందని తెలిపారు. అడవిలోని శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై రాత్రివేళల్లో వెళ్లే వాహనాలు 40 కిలోమీటర్ల వేగంతో వెళ్లాలని, వాహనాలు అడవిలో ఎక్కడా నిలిపివేయొద్దని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై అటవీశాఖ కేసులు నమోదు చేస్తామని డీఎఫ్‌వో హెచ్చరించారు.

సర్దుబాటుతోనే సరి

» 104 వాహన సేవలను రద్దు చేసిన గత ప్రభుత్వం
» ఆయా విభాగాల్లో సిబ్బంది సర్దుబాటు
» ఐదునెలలుగా ఉద్యోగులకు నిలిచిపోయిన వేతనాలు
» తుప్పు పట్టిపోతున్న వాహనాలు



పెద్దమందడి పీహెచ్‌సీ దగ్గర మూలకుపడిన 104 వాహనాలు

వనపర్తి వైద్యవిభాగం, మార్చి 1 : గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సేవలందించిన 104 వ్యవస్థకు గత ప్రభుత్వం మంగళం పలికింది. దీంతో వాహనాల్లో పని చేస్తున్న ఉద్యోగులను వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రం, టీ హబ్, డ్రగ్ స్టోరేజ్ వంటి ప్రదేశాల్లో సర్దుబాటు చేశారు. కానీ వారికి జీతాలు చెల్లించాల్సిన అధికారులు మాత్రం అవేవి తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తూ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. సిబ్బంది సేవలను వినియోగించుకుంటున్నప్పటికీ వేతనాల విషయంలో మాత్రం పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

2008వ సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 104 వాహన వైద్యసేవలను అందుబాటులోకి తీసుకవచ్చారు. ఇందులో ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, డ్రైవర్, డాటా ఎంట్రీ ఆపరేటర్, సెక్యూరిటీ గార్డు సేవలు అందించేవారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న సిబ్బంది ఈ వాహనాల ద్వారా లక్షల మందికి వైద్య సేవలు అందించారు. గత ప్రభుత్వం 2022 జనవరిలో 104 వాహన సేవలను రద్దు చేసింది. పాలమూరు ఉమ్మడి జిల్లాలో 225 మంది పని చేసేవారు. వీరిని ఆయా విభాగాల్లో సర్దుబాటు చేశారు. అప్పటి నుంచి సిబ్బందికి నెలనెలా జీతాలు సక్రమంగా చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఐదు నెలలుగా వేతనాలు పూర్తిగా నిలిచిపోవడంతో ఇంటి అద్దెలు కట్టుకోలేక, కుటుంబాలను పోషించలేక, పిల్లల స్కూల్ ఫీజులు కట్టుకోలేక సతమతమవుతున్నారు. వనపర్తి జిల్లాలో ఉన్న నాలుగు వాహనాలు పెద్దమందడి పీహెచ్‌సీ దగ్గర మూలకుపడ్డాయి. కొన్ని నెలలపాటు 104 వాహనాలు ఎటూ కదలకుండా ఎండకు ఎండీ, వానకు తడిసీ ఉండటంతో తుప్పు పట్టిపోతున్నాయి. కనీసం వాహనాలను వేలం వేసినా ప్రభుత్వానికి ఆదాయం సమకూరేది. లేకపోతే ఇతర అవసరాల కోసం ఉపయోగించుకోవాల్సి ఉన్నా బాగుండేది. నిత్యం జిల్లా జనరల్ ఆస్పత్రి నుంచి మాతా శిశు సంరక్షణ కేంద్రానికి ఏదో ఒక పని నిమిత్తం వాహనాలను తిప్పుకున్నా బాగుండేదని వైద్య నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మాకు భరోసా ఇవ్వాలి



104 వాహనాల్లో విధులు నిర్వహించిన తమకు ఐదు నెలలుగా జీతాలు రావడం లేదు. వేతనాలు రాకపోవడంతో దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నాం. కుటుంబ పోషణ భారమైంది. అప్పట్లో కొందరు ఔట్ సోర్సింగ్ వ్యవస్థలోకి మమ్మల్ని తీసుకున్న నిర్ణయం వల్ల మేము చాలా నష్టపోతున్నాం. ఇకనైనా మమ్మల్ని రెగ్యులర్ చేయాలి. లేదంటే కనీసం కాంట్రాక్ట్ పద్ధతిలోనైనా మార్చి మా బతుకులకు భరోసా కల్పించాలి.

- నవీన్, 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

గొర్రెలకు గ్రాసంగా..



నాయినోనిపల్లిలో నీరులేక ఎండటంతో గొర్రెలకు గ్రాసంగా మారిన వరి పంట

హన్వాడ, మార్చి 1 : రోజు రోజుకు భూగర్భ జాలలు పడిపోయి బోరుబావుల్లో నీరు తగ్గడంతో సాగు చేసిన వరి పంటలు ఎండిపోతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం నాయినోనిపల్లి గ్రామంలో రైతు భీమయ్యకు ఎకరంన్నర వ్యవసాయ భూమి ఉన్నది. బోరుబావి ఆధారంగా ఎకరం భూమిలో వరి, రాగులు సాగుచేశాడు. అందులో సరిపడా నీరు రాకపోవడంతో వరి పంట ఎండిపోతోంది. దీంతో గొర్రెలకు గ్రాసంగా ఇచ్చాడు.

శాసన మండలి ఉప ఎన్నిక లెక్కింపు కేంద్రం కోసం బాలుర జూనియర్ కళాశాల పరిశీలన



కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూమ్‌ల కోసం పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), మార్చి 1 : మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసన మండలి ఉప ఎన్నిక కౌంటింగ్ కేంద్రం కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను శుక్రవారం కలెక్టర్ జి. రవినాయక్ పరిశీలించారు. కౌంటింగ్‌కు సంబంధించి హాల్‌ను, స్ట్రాంగ్ రూం కోసం వివిధ గదులను పరిశీలించారు. కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూంలకు సంబంధించి మ్యాప్‌లు రూపొందించాలని సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. కలెక్టర్‌తో పాటు ఏఎస్పీ రాములు, జడ్పీ సీఈవో రాఘవేంద్రరావు, ఆర్డీవో నవీన్, అర్బన్ తహసీల్దార్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

- క్యాలెండర్ ఆవిష్కరణలో టీఎస్ ఎస్‌పీడీసీఎల్ ఎస్.ఈ పి.వెంకటరమేష్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్.ఈ, డీఈటీ, డీఈలు

పాలమూరు, మార్చి 1 : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని టీఎస్ ఎస్‌పీడీసీఎల్ ఎస్.ఈ పి.వెంకటరమేష్, డీఈటీ డి.చంద్రమౌళి, ఎస్ఏఓ బీచుపల్లి సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్‌లో తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజల కోసం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఇంటింటికీ వెళ్లి బిల్లింగ్ చేసి తెల్లరేషన్‌కార్డు ఉన్నవారికి జీరో బిల్లులు వచ్చే విధంగా చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి టి.గంగాధర్, హుస్సేన్, నారాయణ, వెంకట్రాములు, మోహన్‌బాబు, జమ్ములు, సత్యనారాయణ, సత్యంనాయక్, చంద్రకళ, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసులు, ప్రసన్నకుమార్, చంద్రశేఖర్, స్వరాజ్, శ్రీనివాస్, వేణు, యాదయ్య పాల్గొన్నారు.

న్యాయవాదుల పరస్పర సహకార సంఘం ఎన్నిక

- అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఆనందరావు



అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆనందరావు

మహబూబ్‌నగర్ లీగల్, మార్చి 1 : న్యాయవాదుల పరస్పర సహకార సంఘం అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది ఆనందరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అధ్యక్ష పదవిలో ఆయన ఏడాది పాటు కొనసాగుతారు. 11మంది డైరెక్టర్లకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆనందరావు అత్యధిక ఓట్లను సాధించారు. ముందుగా ఆయన అధ్యక్షుడిగా కొనసాగాలని మిగతా పదిమంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయవాదుల పరస్పర సహకార సంఘం కార్యాలయంలో మాజీ అధ్యక్షుడు రవిప్రకాష్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు కార్యదర్శిగా కాంతారెడ్డి, కోశాధికారిగా సతీష్ చేపట్టారు. కార్యక్రమంలో డైరెక్టర్లు చంద్రమౌళి, రోహిణి, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు. అధ్యక్షుడు ఆనందరావుకు సీనియర్, జూనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం

గండీడ్/ మహమ్మదాబాద్, మార్చి 1 : చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం గండీడ్, మహమ్మదాబాద్ మండలాల పరిధిలోని పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేశారు. ఇటీవల విశ్వేశ్వర్‌రెడ్డి జన్మదినం జరిగింది. ప్రతీ సంవత్సరం లాగే ఈ సారీ రెండు మండలాల్లోని గ్రామాల్లో 49మంది విద్యార్థులను గుర్తించగా, ప్రస్తుతం 23 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 2500 చొప్పున చెక్కులను అందజేసినట్లు జేకేఎంఆర్ ఫౌండేషన్ మండల కో ఆర్డినేటర్ వెంకటయ్య తెలిపారు. మిగతా వారికి త్వరలోనే ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. గతేడాది పదవ తరగతిలో టాప్‌గా నిలిచిన వారిని, గ్రామానికో నిరుపేద విద్యార్థిని ఇలా విద్యార్థులను ఎంపిక చేసి ఆర్థిక సాయం చేస్తామని ఆయన తెలిపారు. ఆర్థిక సాయంతో విద్యార్థులకు వారి చదువులకు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ప్రభు నాయక్, నాయకులు కృష్ణయ్య, వెంకటయ్య కృష్ణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరశెట్టి పల్లిలో వ్యవసాయాధికారుల పర్యటన



వరి మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

నవాబ్‌పేట, మార్చి 1 : యాసంగి పంటలకు వస్తున్న చీడపురుగుల నివారణకు వ్యావసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించాలని జిల్లా వ్యవసా అధికారి బోవొళ్ల వెంకటేష్ అన్నారు శుక్రవారం మండలంలోని వీరశెట్టిపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి కృష్ణ కిషోర్‌తో కలిసి పంటలను పరిశీలించి రైతులకు చీడపురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. యాసంగి పంటలకు కాండం తొలుచు, అగ్గి తెగులు వంటివి వచ్చే అవకాశం ఉందని, దీనికి ప్రధాన కారణం పొటాష్ శాతం తగ్గిపోవడమేనన్నారు. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలని కోరారు. ఏఈవో తేజస్విని, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వరి పైరును పరిశీలించిన వ్యవసాయాధికారి

హన్వాడ, మార్చి 1 : రైతులు వరి పంటకు సోకిన తెగుళ్లకు మందులు పిచికారి చేస్తేనే తెగుళ్లు తగ్గి పంట దిగుబడి వస్తుందని రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయ అధికారి కృపాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నాయినోనిపల్లి గ్రామంలో వరి పైర్లను పరిశీలించారు. ఏఈవో రమేష్ ఉన్నారు.

మాదిగ అమరవీరులకు ఘన నివాళి

పాలమూరు, మార్చి 1 : ఎస్సీ వర్గీకరణ కోసం ప్రారంభమైన ఉద్యమంలో పాల్గొని నేటివరకు తమ ప్రాణాలు కోల్పోయిన మాదిగ అమరవీరులను స్మరించుకోవటం మనందరి బాధ్యత అని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో మాదిగ అమరవీరులకు ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్గీకరణ కోసం వారు చేసిన పోరాటం, ఉద్యమం నేడు ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరణ అయ్యేంతవరకు కలిసికట్టుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.బాలయ్య, బాలరాజు, ఎం.శ్రీరాములు, కె.ఖాదరయ్య, వినోద్, కొండయ్య, శ్రీనివాసులు, బాలనాగయ్య, కమాలకర్, గణేష్, కిరణ్ పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ రవినాయక్

ఇంటర్, పది పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ తీసుకుపోవద్దు

మహబూబ్ నగర్ (కలెక్టరేట్), మార్చి 1 : ఇంటర్ మీడియట్, పదవ తరగతి పరీక్ష కేంద్రాలలోకి ఎవరూ సెల్ ఫోన్‌లు తీసుకెళ్లవద్దని కలెక్టర్ జి. రవినాయక్ సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి ఇంటర్, పదవ తరగతి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జరుగుతున్న ఇంటర్, త్వరలో ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు చేపట్టిన ఏర్పాట్లను వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ సంబంధిత జిల్లా అధికారులు, విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతూ ఇప్పటికే ఇంటర్ పరీక్షలు ప్రాంభమయ్యాయని, మార్చి 18 నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షకేంద్రాలలోకి ఎవరుకూడా సెల్ ఫోన్‌లు తీసుకవెళ్లరాదని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎ. రాములు, డీఆర్వో రవికుమార్, జడ్పీసీఈఓ రాఘవేంద్రరావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రవీందర్ పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్ నగర్ (కలెక్టరేట్), మార్చి 1 : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి మోడల్ స్పోర్ట్స్, వాటర్ స్పోర్ట్స్ అకాడమీ (క్రీడా పాఠశాల)లో 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నారు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకు చెందిన గిరిజన బాల, బాలికల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు రెండు జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి చత్రు నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయస్సు 31-8-2024 నాటికి 9 నుంచి 11 సంవత్సరాల లోపు ఉండాలని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థుల ఎత్తు, బరువు, స్టాండింగ్ బాడ్ జంప్, సర్టికల్ జంప్, మెడిసిన్ బాల్ త్రో, 30 మీటర్లు అని, ఫ్లయింగ్ స్టార్ట్, ఫ్లెక్సిబిలిటీ, 800 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన, 10మంది బాలురు, 10మంది బాలికలను రాష్ట్ర స్థాయి ఎంపికలకు పంపనున్నట్లు తెలిపారు. ఈనెల 6న జిల్లా స్థాయి ఎంపికలను జిల్లా క్రీడా ప్రాంగణంలో జరుగుతాయని తెలిపారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, గ్రామీణ ప్రాంతం వారికి 1,50,000, పట్టణ ప్రాంతం వారికి 2,00,000 లకు మించి సంవత్సర ఆదాయం ఉండరాదని తెలిపారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని గిరిజన అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తును సమర్పించాలని ఆయన తెలిపారు.

వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోండి

- ఆస్తిపన్నుదారులకు మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ సూచన

మహబూబ్‌నగర్, మార్చి 1 : ప్రభుత్వం ఆస్తిపన్నుపై వడ్డీని 90శాతం మాఫీ చేస్తూ ఇచ్చిన అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ కోరారు. 2022-23 ఆర్థిక సంవత్సరం నాటికి బకాయి ఉన్న మొత్తం ఆస్తిపన్నుపై వడ్డీని 90శాతం మాఫీ చేసిందని, దీంతో ప్రజలు మిగిలిన 10 శాతం జరిమానా, ఆస్తిపన్ను బకాయి మొత్తం ఒకే సారి చెల్లించాలని కోరారు. శుక్రవారం మునిసిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని, ఇందుకు పట్టణ ప్రజల తరఫున ముఖ్యమంత్రికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పాలమూరు



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

పురపాలికలో కొన్నేళ్లుగా చాలామంది పన్నులు చెల్లించడం లేదని, దాదాపు రూ.20 కోట్ల ఆస్తిపన్ను, రూ.17కోట్ల వడ్డీ పెండింగ్‌లో ఉందని చెప్పారు. ఇప్పుడు ఈ వడ్డీ మార్చి 31లోపు చెల్లించిన వారికి మాఫీ వర్తించనుందని తెలిపారు. ఇప్పటికే వడ్డీతో సహా చెల్లించిన వారికి వచ్చే ఏడాది పన్నులో చెల్లించిన వడ్డీని జమచేసుకోనున్నట్లు తెలిపారు. జరిమానాతో చెల్లింపులు చేసిన ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పట్టణ ప్రజలు చెల్లించే పన్నుల ద్వారానే మునిసిపాలిటీకి ఆదాయం వస్తుందని, తద్వారా ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజల అవసరాలను తీర్చేందుకే తామున్నామని, ఈ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకుని రాష్ట్రంలోనే ఆదర్శ మునిసిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆస్తి పన్నుతో పాటు దుకాణాల అద్దెలు, కొళాయి పన్నులు సకాలంలో చెల్లించాలని ప్రజలను కోరారు. ప్రజలపై భారం మోపవద్దనే ప్రభుత్వం గతంలో ఎన్నడూలేని విధంగా పెద్దఎత్తున జరిమానా మాఫీని చేసిందని గుర్తుచేశారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి ప్రజాప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్లాస్టిక్ నిషేధంపై ఊగిసలాట

- ఏళ్ల తరబడి అమలుచేయలేకపోతున్న వైనం
- మొక్కుబడిగా ఏడాదికి రెండు విడతల్లో తనిఖీలు
- విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం

మహబూబ్‌నగర్, మార్చి 1 : పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేయడం, ఉదాసీనతగా వ్యవహరించడంతో వ్యాపారులు యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగిస్తూనే ఉన్నారు. పాలమూరు పురపాలికతో పాటు జిల్లాలోని అన్ని మునిసిపాలిటీలు, గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగం సాగుతోంది. 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ పరిమాణం ఉన్న ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నట్లు ఏళ్ల క్రితమే ప్రభుత్వం ప్రకటించినా మార్కెట్‌లో మాత్రం విచ్చలవిడిగా వాటిని వినియోగిస్తున్నారు. కొన్ని పెద్దపెద్ద మాల్స్, సూపర్ మార్కెట్‌లలో జ్యూట్ బ్యాగ్‌లు వాడుతున్నా చిన్నచిన్న వ్యాపారులు, మటన్, చికెన్ దుకాణాలు, బజ్జీల బండ్ల వద్ద విచ్చలవిడిగా వినియోగిస్తూనే ఉన్నారు. పాలమూరు పురపాలిక పరిధిలో అధికారులు ఏడాదికి రెండుసార్లు డ్రైవ్ నిర్వహించి జరిమానాలు విధించడం, ప్లాస్టిక్‌ను సీజ్ చేస్తున్నట్లు చూపి, చేతులెత్తేస్తున్నారు. మూడు, నాలుగు రోజులు తనిఖీలు చేసి ఆ తరువాత మూడు, నాలుగు నెలలు అటువైపు చూడకపోవడం వల్ల వ్యాపారులకు ఇదే అలవాటుగా మారింది. ఫెనాలిటీలు కూడా నామమాత్రంగా వేసి వదిలేస్తున్నారు. రూ. 500, 1000 మహా అయితే రూ.2 వేలు జరిమానాలు విధించడం వల్ల వ్యాపారులు కూడా లైట్‌గా తీసుకుంటున్నారు. దుకాణాలను సీజ్ చేయడమో లేకపోతే భారీగా జరిమానాలు విధించడమో చేస్తే వ్యాపారుల్లో



ప్లాస్టిక్‌పై తనిఖీలు చేస్తున్న పుర సిబ్బంది

భయం ఉంటుంది. అలాకాకుండా ఎప్పుడో ఓసారి నామమాత్రపు తనిఖీలు, నామమాత్రపు జరిమానాలతో సరిపెట్టి వదిలేయడం వల్ల ఉపయోగం ఉండదు. ఒకసారి ప్లాస్టిక్ పట్టుపడ్డప్పుడే కఠిన చర్యలు తీసుకుంటే మిగతా వారిలో భయం ఉంటుంది. మొక్కుబడి తనిఖీలు, పరోక్షంగా అధికారులు సహకరించడం వల్ల ప్లాస్టిక్‌ను నిషేధించడం సాధ్యం కాదని స్పష్టమవుతోంది. మూడ్రోజుల క్రితం పురపాలికలో నిర్వహించిన తనిఖీలో 159 కిలోల ప్లాస్టిక్ సీజ్ చేయడంతో పాటు పలు దుకాణాలకు రూ.28వేలు జరిమానాలు విధించారు. తనిఖీలను పెంచి సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాల్సిన అవసరం ఉంది.

బీఆర్ఎస్ నాయకులు పోవాల్సింది ఎర్రగడ్డకు

- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



కర్వెన రిజర్వాయర్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్, మార్చి 1 : బీఆర్ఎస్ పార్టీ నాయకులు మేడిగడ్డకు కాదని, ఎర్రగడ్డకు పోవాలని దేవరకద్ర నియో జకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే అధ్యక్షతన ఏర్పాటు చేసిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమాన్ని పార్లమెంటు నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు అనిరుధ్ రెడ్డి, ఈర్లపల్లి శంకర్, పర్ణికారెడ్డి, శ్రీహరి, ఎన్నెం శ్రీనివాస్‌రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి తదితరులు శుక్రవారం కర్వెన, ఉదండాపూర్, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కర్వెన రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి మాట్లాడారు. కర్వెన రిజర్వాయర్ 80శాతం పూర్తి అయ్యిందని గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తపుడు సమాచారం ఇచ్చి ప్రజలను తప్పుదోవపట్టించిందని అన్నారు. వాస్తవానికి కర్వెన ప్రాజెక్టు కనీసం 50శాతం పనులు కూడా పూర్తికాలేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్ల కోసం ఆంధ్ర నాయకులకు కాంట్రాక్టులు కట్టబెట్టారని, అదే విధంగా ప్రజల సొమ్మును దోచుకొని వేల కోట్లు కేసీఆర్ ఆయన కుటుంబ దాచుకున్నారని ఎమ్మెల్యే తీవ్రస్థాయి ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులు ప్రజల ముందుకు వచ్చి క్షమాపణ కోరుకోవాలని మధుసూదన్‌రెడ్డి హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు హర్యానాయక్, మాధవరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మాసగౌడ్, శివరాములు, కెంద్యాల నరేందర్, మాజీ ఎంపీటీసీ పాలరాములు వివిధ గ్రామాల నుంచి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

4న వంశీచంద్‌రెడ్డి పాదయాత్ర

- కాంగ్రెస్ నాయకుడు ఎన్‌పీ వెంకటేశ్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు ఎన్‌పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్, మార్చి 1 : ఈనెల 4న కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ స్థానం ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి మహబూబ్‌నగర్‌లో పాదయాత్ర నిర్వ హించనున్నారని కాంగ్రెస్ నాయకుడు ఎన్‌పీ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహబూబ్‌నగర్, హన్వాడ మండల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ పాదయాత్రను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. పాదయాత్రలో కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. నాయకులు ఎం. సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు నాయకులు, కార్యకర్తలు పని చేయాలని అన్నారు. వ్యక్తిగతంగా కాకుండా పార్టీకోసం పనిచేయాలని, రానున్న పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఇందుకోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరాజ్‌ఖాద్రి, మల్లు నర్సింహారెడ్డి, బి మహేందర్, రాజునాయక్, చెన్నయ్య పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

- డీఆర్‌డీవో నర్సింములు

రాజాపూర్, మార్చి 1 : మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రతీ నర్సరీలోని మొక్కలను సంరక్షించాలని డీఆర్‌డీవో పీడీ నర్సింములు అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని స్థానిక నర్సరిని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మండల అధికారులతో పాటు ప్రకృతి వనంలోని మొక్కలకు నీటిని పట్టిన్నారు. మొక్కలకు నీటి సదుపాయం కల్పించాలని, లేకపోతే నూతనంగా బోర్లు ఏర్పాటు చేసి మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని మండల అధికా రులకు సూచించారు. ఆయన వెంబడి ఎంపీడీవో మశ్చేందర్, ఎంపీవో వెంకట్ రాములు, ఏపీవో భారతి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలకు నీరు పడుతున్న అధికారులు

గాలికుంటు వ్యాధి నివారణకు కృషి

బాలానగర్, మార్చి 1 : పాడి పశువులు కలిగిన రైతులు గాలికుంటు వ్యాధి నివారణకు వైద్య సిబ్బందికి సహకరించి వ్యాధి నిరోధ టీకాలు వేయించేలా కృషి చేయాలని పశు వైద్యుడు డాక్టర్ రఘురాంకుమార్ అన్నారు. శుక్రవారం గాలికుంటు వ్యాధి నివారణ కర్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గౌతాపూర్, వనమాలిగూడ గ్రామాలలో సుమారు 270 పశువులకు వైద్య సిబ్బంది గాలికుంటు వ్యాధినివారణ టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. మూతిపుండ్లు, కాలు గిట్టలలో పుండ్లు ఏర్పడడంతో పాటు విపరీతంగా జ్వరం వచ్చి పశు మేకున ఉంటుందని అన్నారు. రైతులు తప్పనిసరిగా వైద్య సిబ్బందికి సహకరించి తమ పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాను ఇప్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, వైద్య సిబ్బంది ప్రభాకర్, శివకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా గరుడ వాహన సేవ

జడ్చర్ల, మార్చి 1 : వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వేంకటేశ్వరస్వామిని గరుడవాహనంపై వీధుల్లో తిరుగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో సీఐ ఆదిరెడ్డి, ఎస్‌ఐలు, ఆలయ ధర్మకర్త నరహరి భీంసేనాచార్య భక్తులు పాల్గొన్నారు.

గోవిందనామంతో మార్మోగిన భూత్పూర్

- ఘనంగా మునిరంగస్వామి తేరు ఉత్సవాలు

భూత్పూర్, మార్చి 1 : మునిసిపాలిటీ పరిధిలోని 44వ జాతీయ రహదారి ప్రకన వేలసిన చింతల మునిరంగస్వామి జాతర ఉత్సవాలు ఫిబ్రవరి 29నుంచి ప్రారంభం అయ్యాయి. అయితే రెండవరోజు శుక్రవారం స్వామివారి తేరు ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలకరించిన తేరును భక్తులు మునిరంగస్వామి దేవాలయం నుంచి గ్రామంలో ఉన్న సంజీవరాయుని దేవాలయం వరకు రాత్రి 12గంటలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మునిసి పల్ చైర్మన్ బస్వరాజుగౌడ్, మాజీ సర్పంచ్ నారాయణగౌడ్, యువకులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 1 : రాంనగర్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న బోజనం చక్కగా ఉందని సీఎంవో బాలు యాదవ్ అన్నారు. శుక్రవారం రాంగనర్ పాఠశాలలో మధ్యాహ్న బోజనాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు రుచికరమైన వంటను అందించడంతో ఏజేన్సీని అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంజలిదేవి, ఉపాధ్యాయులు లోకారెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

ధ్రువపత్రాల అందజేత

మహబూడ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 1 : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే పోటీ పరీక్షలు అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గతనెల 18న పదవ తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు అందజేసేందుకు అంబేడ్కర్ కళాభవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పూర్వ ఎస్ఎఫ్ఐ నాయకులు, సుశ్రుత ప్రజావైద్యశాల ఎండీ ప్రతిభామధుసూదన్ రెడ్డి, జేపీఎన్‌సీఈ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ రవి కుమార్, విజేత వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవార్డుల బహూకరణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 1 : సోహం అకాడమీ ఆఫ్ ఎక్స్‌లెన్స్ వారి ఆధ్వర్యంలో గురువారం నగరంలోని శిల్పారాములో నిర్వహించిన రోబోటిక్స్ లో నైపుణ్యం సాధించిన విద్యార్థులకు అవార్డులను శుక్రవారం బహూకరించారు. ఈ కార్యక్రమంలో 17 జిల్లాల నుంచి 252 ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అందులో రోబోటిక్స్ నందు నైపుణ్యం సాధించిన 10 పాఠశాలలను ఎంపిక చేశారు. అందులో మహబూబ్‌నగర్ పట్టణంలోని మహాత్మా గాంధీ రోడ్డు పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. పాఠశాల విద్యార్థినులు జ్ఞానిక, ఆయేశాలు రోబోటిక్స్‌లో నైపుణ్యం సాధించి ఇన్నోవేషన్ అకంప్లీష్‌మెంటు అవార్డు మాస్టర్ రోబోటిక్స్‌లో ప్రథమ స్థాయి అవార్డు పొందిన విద్యార్థులను హెచ్‌ఎం జగదీశ్వర్‌చారి, ఉపాధ్యాయులు అభినందించారు.

లింగ సమానత్వంపై అవగాహన

జడ్చర్ల, మార్చి 1 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా లింగ సమానత్వంపై మండలంలోని గోప్లాపూర్ లో సోమవారం మంహిళలకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణజ్యోతి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడబ్ల్యూటీవై సురేఖ, ఏడబ్ల్యూహెచ్‌జీ పోషమ్మ, ఆశ కార్యకర్త శామంత, సుజాత, మహిళలు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జూనియర్ బాలుర జట్టు ఎంపిక

జడ్చర్ల, మార్చి 1 : ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జూనియర్ బాలుర ఎంపిక పోటీలు ఈ నెల 3న మండలంలోని జడ్పీహెచ్ పాఠశాల కోడ్గల్‌లో నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ పోటీలకు ఆధార్ కార్డు జిరాక్స్, జననధ్రువపత్రం తీసుకొని రావాలని కోరారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా రాయాలి

దేవరకద్ర, మార్చి 1 : మూడు రోజల నుంచి జరిగే ఇంటర్మీడియేట్ పరీక్షలు ప్రశాంతంగా రాయాలని తహసీల్దార్ శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ కళశాలలో జరిగే ఇంటర్ మొదటి సంత్సరం పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పిల్లలకు కావాల్సిన తాగునీరు అందుబాటులో ఉంచాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు కలాశాలల్లో చదువుతున్న విద్యార్థులు, మొదటి సంత్సరం విద్యార్థులు 585 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 552 మంది రాశారని, 33 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

అయోధ్యకు భక్తుల పయనం

- ఆస్తా ట్రైన్‌ను జెండా ఊపి ప్రారంభించిన మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్

జడ్చర్ల, మార్చి 1: జడ్చర్ల రైల్వే స్టేషన్‌లో అయోధ్య రామయ్య దర్శనానికి జడ్చర్ల, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల నుంచి వెలుతున్న రామభక్తులకు శేభాకాంక్షలు తెలిపి ఆస్తా ట్రైన్‌కు జెండా ఊపి మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు జె.చిత్తరంజన్‌దాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ నర్సింహులు, కల్వకుర్తి నియెజకవర్గ కన్వీనర్ ఎన్నం శేఖర్‌రెడ్డి, నాయకులు తిరుపతి, నిరంజన్‌గౌడ్, సాహితిరెడ్డి, రమేష్, నరేందర్, శ్రీశైలం, బాలస్వామి, గౌరీశంకర్, మురళి, మల్లేష్‌లు పాల్గొన్నారు.